# లవ్ డైవర్షన్

– యల్లంశెట్టి శాయి



చిరంజీవి హాల్లోకూర్చుని తెలుగు నవల చదువుతున్నాడు. ఆ నవలపేరు "జీవన కెరటాలు - జీవిత కలశాలు.' అందులో హీరో ప్రతి అయిదో పేజీలో ఓ పాపంచేసి ప్రతి పదకొండో పేజీలో మళ్ళీ పశ్చాత్తాపం పడుతున్నాడు. హీరోయిన్‌కి-కసాయివాణ్ని నమ్మిన గొర్రెలా-హీరో ఎన్ని వెధవ పనులు చేస్తున్నా వాడిమీద ఆరాధన పెరిగిపోతోంది. చివరకోసారి ఆ హీరో-ఆ హీరోయిన్ని పట్టుకొని చావతన్ని ఒంటిమీద నగలన్నీ వలిచేసుకొని 'రాజ్‌కమల్' బార్‌లో దూరిపోయాడు. అప్పుడుకూడా హీరోయిన్ - ఆ హీరో తాలూకు ఫోటో ఒకటి తీసుకొని గుండెలకు హత్తుకొని 'కలకాలం నువ్వే నా భర్తగా ఉండు నాథా' అంది బాధగా.

ఇక్కడదాకా చదివేసరికి చిరంజీవికి ఏడుపొచ్చేసింది. ఆ ఏడుపు హీరోయిన్ని చూశా - లేక ఆ నవల చదివినందుకా - అనేది అతనికే తెలీదు. ఆ దుఃఖం ఆపుకోడానికి చిరంజీవి విశ్వప్రయత్నం చేశాడుగానీ కుదర్లేదు. ఇక లాభంలేదు, ఏడ్చేద్దాం అనుకొంటూండగానే "వీణ ఉందాండీ ?" అన్న గొంతు వీణమీటుతున్న ధ్వనిలా వినిపించింది. "అరె! భలేగుందే! ఏడ్చే వాళ్ళందరికీ ఇలా "వీణ ఉందాండీ ?" అన్న గొంతు వినబడుతుందేమో" అని హోరున ఆశ్చర్యపడి మళ్లీ ఏడవడానికి సన్నాహాలు చేస్తుండగా మళ్ళీ "వీణ ఉందాండీ ?" అన్న గొంతు ఇంకొంచెం గట్టిగా వినబడింది. ఈసారి ఆ గొంతు వెనుకే గాజుల చప్పుడు కూడా వినబడింది. వెంటనే గురిచూసి ఆ చప్పుడు వచ్చినవేపు తలెత్తి చూశాడు చిరంజీవి. అంతే! ఆ చూపు అలా నిలబడిపోయింది. ఒక్క అంగుళం కూడా అటూ ఇటూ కదల్లేదు. ఆ చూపుల్ని, వాటి తాలూకు మనిషినీ అలా కట్టేసిన అమ్మాయి అతని వ్యవహారానికి కొంచెం ఖంగారుపడి ఓ అడుగు వెనక్కు వేసింది.

"అబ్బో ఈ అమ్మాయి ఎంత బావుందో!" అనుకున్నాడు చిరంజీవి కొద్ది నిమిషాల తరువాత.

"వీణ ఉందాండీ ?" అందామ్మాయ్ భయంగా.

"అబ్బ! గొంతు ఎంతబావుందో.." అనుకొన్నాడు చిరంజీవి కొద్ది నిమిషాల తరువాత.

"వీణ ఉందాండీ ?" అందా అమ్మాయ్ అరిగిపోయిన రికార్డులాగా.

అరిగిపోయిన రికార్డులంటే చిరంజీవికి భయం. అంచేత వెంటనే ఖంగారుపడి "ఏమిటి ? ఎవరు ?" అన్నాడు.

"వీణ...వీణ..." అందా అమ్మాయి. ఆ పేరు వినగానే, ఛటుక్కున ఈలోకంలోకి వచ్చిపడ్డాడు. చిరంజీవి వెంటనే అతనికి కొన్ని విషయాలు గుర్తుకొచ్చినయ్! తను ప్రస్తుతం 'ఉయ్యూరు' అనే ఊళ్ళో వాళ్ళత్తయ్య గారింట్లో ఉన్నాడు. ఆ అత్తయ్య అనే ఆవిడకు 'వీణ' అనే పేరుగల కూతురుంది. బహుశా ఈ అమ్మాయి పలువరించేది ఆ 'పేరు' అయుండాలి.

"ఓహో....వీణకావాలా ?"అన్నాడు చిరంజీవి ప్రకాశంగా.

"అవును. వీణ" అందా. అమ్మాయ్.

"వీణ అంటే నేనింకేమిటో అనుకున్నాను...." నవ్వుతూ అన్నాడు.

"ఊహు ! అదే- వీణ !" అందా అమ్మాయి సిగుపడుతూ.

"వీణ ఇంట్లో లేదు...."

"ఓహో ! లేదా ?"

"కొంచెం కూడా లేదు...."

ఆ అమ్మాయికి బో లె డు నవ్వు వచ్చిందిగాని, కొంచెమే నవ్వింది. మిగతా పెదాల వెనుక, నొక్కిపట్టి దాచేసింది.

"ఎక్కడికెళ్ళింది ?"

"పక్కింటి కని చెప్పింది .... కాని ఎటు పక్కిల్లో చెప్పలేదు..."

"అయితే ఇప్పుడు వచ్చేస్తుందను కొంటాను...."

"ఊహు ! చాలాసేపు పడుతుందను కొంటాను...."

"ఎంతపు సేపు?"

"రెండు నిమషాలన్నా పడుతుంది.."

"ఓహో...."

ఈలోగా తక్కున వీణ లోపలి కొచ్చేసింది.

"హల్లో కృష్ణా ! వచ్చేశావా ?" అంది వీణ ఆ అ మ్మా యి ని చూసి నవ్వుతూ.

"ఇప్పుడే......అడుగుతున్నాను .... ఇంతలోనే..." నవ్విందా అమ్మాయ్ !

"అబ్బ! ఆ నవ్వు ఎంత బాగుందో"! అనుకొన్నాడు చిరంజీవి.

అన్నట్లు ఈయన మా బావ చిరంజీవి—ఈమె మా ఫ్రెండ్ బావా ! పేరు కృష్ణకుమారి..."

"నమస్తే...."అంది కృష్ణకుమారి.

"నమస్తే....నమస్తే !" అన్నాడు చిరంజీవి.

"కూర్చోండి ! అయిదు నిమిషాల్లో 'టీ' తీసుకొస్తాను... ఈ లోగా మీరు "కాలేజి విద్యార్థినులూ - వారి ప్రేమ కలాపాలూ "అన్న విషయం గురించి మాట్లాడుతూండండి...."

"ప్రేమ కలాపాలా ?" ఖంగారుగా. భయంగా అన్నాడు చిరంజీవి.

"పోనీ ప్రణయ కలాపాలయినా సరే...." నవ్వుతూ అని లోపలకు పరుగెత్తింది వీణ.

కుర్చీలో కూలబడ్డాడు చిరంజీవి. కృష్ణకుమారి ఇంకా నుంచునే ఉండటం చూసి" ఇంకా నుంచునే ఉన్నారేం ? కూర్చొండి !" అన్నాడు. చాలా బిడియంగా కూర్చుంది కృష్ణకుమారి.

"మీరు ఇంటర్మీడియట్టేనా ?" అడిగాడు చిరంజీవి చేతివేళ్ళు లెక్కపెట్టుకొన్నాక.

"అవునండీ...."

"పరీక్ష లెప్పుడు ?" అన్నాడు ఆ అమ్మాయి చేతివేళ్ళు కూడా లెక్కకట్టాక.

"ఇంకా రెండునెల లున్నాయి!"

"తర్వాత ఇంకా చదువుతారా ?" మళ్ళీ తన చేతివేళ్ళు లెక్కపెట్టుకొని.

"పరీక్ష ల య్యా క ఇంకెందుకూ చదవడం ?" ఆశ్చర్యంగా అడిగింది కృష్ణకుమారి.

"అంటే - నా ఉద్దేశం....పరీక్షలని

కాదు—ఇంటర్మీడియట్ అయాక...."

"అదా....ఏమో! మా వాళ్ళిష్టం..." అలా అని అతని వంక క్రీగంట చూసింది కృష్ణకుమారి. నల్లగా ఉన్నా, చైనీస్ మీసాల్తో ముచ్చటగా, తమాషాగా ఉందతని మొఖం. ధైర్యం తెచ్చుకొని తలెత్తి అతనివంక వివరంగా చూసిం దామె. సరిగ్గా అప్పుడే చిరంజీవికూడా ఆమె కళ్ళల్లోకి వేగంగా చూశాడు. అయితే ఆ అమ్మాయి చూపులకు ఖంగారుపడి; కప్పిపుచ్చుకోడానికి గంటకు వెయ్యి కిలోమీటర్ల వేగంతో నోటికొచ్చింది మాట్లాడేశాడు.

"నే నే నేను గగ్గయ్యపేటలో బాంక్‌లో పనిచేస్తున్నాను...."

"గగ్గయ్యపేటా?" ఆశ్చర్యంగా అడిగిందా అమ్మాయి

"సారీ....ఐ మీన్ జగ్గయ్యపేట.... అంటే .. అదే నూజివీడు దగ్గర...."

"నూజివీడు దగ్గరా ? ...." మరీ ఆశ్చర్యంగా అందామె

"ఓహో ! నూజివీడంటే—నూజివీడు కాదు—నందిగామ...."

"ఓహో...."

"నిన్న ఈ ఊళ్లో మా ఫ్రెండ్ మారేజ్ ఉంటే వచ్చాను .... వెంటనే వెళ్ళిపోదామంటే మా అత్తయ్య—అదే—వీణా వాళ్ళమ్మ — బలవంతం చేసింది. ఓ రోజు ఉండి పొమ్మని .... .... నాకేమో 'బోర్' కొట్టేస్తోంది ఈ ఊళ్ళో — ఈ వీణకేమో 'నిశ్శబ్దం' అంటే చాలా ఇష్టమంట. ఎప్పుడూ తన గదిలో ఒంటరిగా కూర్చుని నిశ్శబ్దంగా తెగ ఆనందిస్తూంటుంది."

"ఏదయినా సినిమా కెళ్ళాల్సింది..."

"రాత్రి వెళ్ళాను : అదేదో పేరు.... బస్‌స్టాండ్‌కి దగ్గరగావున్న హాల్లో ఆడుతోంది."

"అదా !" సంక్రాంతి చిన్నోడు..."

"అవునవును ! పరమ చండాలంగా ఉందనుకోండి...చెత్త సినిమా !"

"ఆ సినిమా చండాలంగా ఉందా ?" ఆశ్చర్యంగా, దిగులుగా అడిగింది కృష్ణకుమారి !

చిరంజీవి సందిగ్ధంలో పడిపోయాడు. అందమయిన ఆడపిల్లలను గాయపరచడం అతని స్వభావానికి పూర్తిగా విరుద్ధం.

"అహహ ? .... సినిమా అంతా కాదనుకోండి....అఖర్లో ...."

"ఆఖర్లో కొంచెం ఇదిగా ఉందేమో గాని పిక్చరంతా చాలా అద్భుతంగా ఉంది ! ఆ హీరోయిన్ ఎంత బాగా ఏడ్చిందనీ !"

ముఖ్యంగా వాళ్ళ ఇలవేలుపు అయిన ఆ కప్పని హీరో చంపడానికి వెళ్తూంటే "ఆ కప్పను చంపవద్దండీ ! అది మన ఇంటి ఇలవేల్పండీ ! ఆ కప్ప చల్లని చూపు వల్లనే మనం పిల్లలతో చల్లగా ఉన్నామండీ ! ఆ కప్ప మామూలు కప్ప కాదండీ ! దైవాంశ ఉన్న అవతారమండీ...." అని హీరోయిన్ ఏడుస్తూంటే నిజంగా మాకూ్కడా ఏడుపాగలేదు. మా ఫ్రెండ్సందరం ఒకరికి తెలీకుండా ఒక రేడిచాం అయిదు నిమిషాలసేపు...." అలా అంటూంటే కృష్ణకుమారికి మళ్లీ కళ్ల వెంబడి నీళ్ళుతిరిగి

నయ్.

"పోనీలెండి....చివరకు కప్ప చావ లేదు కదా! మీ కెందు కింకా విచారం?" జాలిగా అన్నాడు చిరంజీవి.

సరిగ్గా అప్పుడే 'టీ' తీసుకొచ్చి వీణ వచ్చేసింది.

'టీ' తాగాక 'వస్తానే' అని వీణ తోనూ, "వెళ్తానండీ...." అని చిరంజీవితోనూ చెప్పి వెళ్ళిపోయింది కృష్ణ కుమారి.

"హాయ్ నాకు నిద్రొస్తోంది...." అంది వీణ ఆవలిస్తూ చిరంజీవి హడలి పోయాడు.


"అదేమిటి? ఇంతకు ముందేగా నువ్ నిద్ర లేచింది?" అన్నాడు ఏడుపు మొఖంతో.

"రాత్రి చాలాసేపు చదువుకొన్నాను బావా!...."

"మరి నువ్ నిద్రపోతే నేనొక్కద్నే ఏం చేయను? .. వళ్ళు మండిందంటే ఇవాళ సాయంత్రమే మా జగ్గయ్యపేట వెళ్ళిపోతాను..." అన్నాడు కొంచెం కోపంగా.

"వద్దు బావగారూ! అంత అలి గెయ్యకండి....కాసేపు నేను మాకాలేజి కబుర్లు చెప్తానుగదా .... కృష్ణకుమారి చూచావ్ గదా? ఈ ఆ అమ్మాయ్ మా కాలేజి బ్యూటీ అన్నమాట! రోజూ వాళ్ళ పోస్టుమన్ ఒక రిక్షాలో ఆమె కొచ్చే లవ్‌లెటర్లు తీసుకొచ్చి ఇస్తుం టాడు. వాళ్ళ తమ్ముడు వాటన్నిటినీ విడివిడిగా సార్ట్ అవుట్ చేసి వాళ్ళమ్మ కిస్తాడు..."

"వాళ్ళమ్మకెందుకు?" ఆశ్చర్యంగా అడిగాడు చిరంజీవి.




"పొయ్యి వెలిగించుకోడానికి...."

మరికాసేపు సరదా కబుర్లు చెప్పి తన గదిలోకి పరుగెత్తుకెళ్ళి నిద్ర పోయిందామె.

ఆ సాయంత్రం చిరంజీవి నిద్ర లేచేసరికి వీణ అతని కెదురుగ్గా నుంచుని ఉంది. అప్పుడే స్నానం చేసినట్లుంది. జుట్టు విరబోసుకొని క్లిప్పులు పెట్టు కొంది. అందమైన ఆమె రూపం చూసి కొద్దిగా చలించాడతను.

"త్వరగా లే బావా! ఇంకా కూర్చున్నావేం?"

"ఏమిటి సంగతి?"

"షుగర్ ఫ్యాక్టరీ వేపు షికారు కెళ్ళాం.....ఆలస్యమయితే కృష్ణకుమారి గొడవచేస్తుంది మళ్ళీ!....

"కృష్ణకుమారా?"

"అవును! తనే కబురు చేసింది వెళ్దామని. ..."

చిరంజీవి కళ్ళముందు ఆ అమ్మాయి రూపం కదిలింది. ఎర్రగా గులాబి పువ్వులా సుకుమారంగా ఉన్న ఆమె అందంతోపాటు ఆమెలో విపరీతమయిన ఆకర్షణ కూడా ఉంది. ముఖ్యంగా ఆ కళ్ళు....చకచక ముస్తాబయ్యాడతను

ఇద్దరూ రిక్షాలో కృష్ణకుమారి ఇంటి కెళ్ళారు. కృష్ణకుమారి వాళ్ళింటిముందు గార్డెన్‌లో కూర్చుని ఏదో తెలుగు నవల చదువుతోంది.

"రండి....రండి...." అంది చిరు నవ్వుతో.

"ఇప్పుడే కుర్చీలు తీసుకొస్తాను.." అంటూ లోపలకు పరుగెత్తింది.

"నువ్ కూర్చో బావా...." అనేసి ఆమె వెనుకే తనూ లోపలకు నడిచింది సరాసరి కృష్ణకుమారి దగ్గరకు పరుగెత్తి "కుర్చీవద్దూ, ఏమీవద్దుగానీ, త్వరగా పదవే బాబూ! అలా షుగర్ ఫ్యాక్టరీ వరకు వెళ్ళొద్దాం!" అంది వీణ.

"నేనా?" ఆశ్చర్యంగా అడిగింది కుమారి.

"అవునే! మా బావ ఒకటే కలవరి స్తున్నాడు- ఆ అమ్మాయిని కూడా తీసు కురా- తీసుకురా- అని! చాలాచక్కగా మాట్లాడతావటగదా నువ్వు! మంచిరో జూసి పద్మశ్రీ ఇచ్చేట్లున్నాడు నీకు...." అంది నవ్వుతూ.

ఆ అమ్మాయికి రాననడానికి మన సొప్పలేదు. అతగాడు తన మీద అంత ఇంట్రెస్ట్ చూపటం ఆమెకు కొంచెం ఆనందాన్ని కొంచెం గర్వాన్ని కలుగ జేసింది.

"ఒక్క నిమషం!" అనేసి అద్దం ముందు కూలబడి ఒక గంట మేకప్ అయి బయటకొచ్చింది.

ముగ్గురూ రోడ్డు పక్కనే నడుస్తూ ఫ్యాక్టరీ వేపు బయల్దేరారు. ఫ్యాక్టరీకూడా దాటేసరికి రోడ్డంతా నిర్మానుష్యంగా అయిపోయింది. అప్పుడే సంధ్యఅలుము కొంటూ ఆ వాతావరణాన్ని అద్భుత దృశ్యంగా మార్చేసింది. ముగ్గురూ ఉత్సాహంగాఏవోమాట్లాడుకొంటూచాలా దూరం నడిచారు. అప్పటికి పూర్తిగా చీకటి పడిపోయింది. ఈ లోగా చిరం జీవికి తెలీకుండానే కృష్ణకుమారితో చాలా చనువేర్పడి పోయింది. వీణ ప్రసక్తి లేకుండానే వాళ్ళిద్దరూ చక్కగా మాట్లాడేసుకోవడం జరిగిపోయింది.

హఠాత్తుగా ఆగిపోయి "అమ్మో!" అంది వీణ.


"ఏమిటి?" ఖంగారుగా అడిగాడు చిరంజీవి.

"మనం ఊరుదాటి రెండు మైళ్ళ యినా వచ్చేసి ఉంటాం! ఇప్పుడు వెనక్కి నడవడం ఎలా?"

"దానేముంది రిక్షాలో వెళ్ళేసరి ..." అంది కృష్ణకుమారి.

ఆ మాట ఎప్పుడు విన్నాడో ఏమో, తక్కున 'ఎక్కండి' అంటూ రిక్షా పక్కకు తీసుకొచ్చి ఆపాడు రిక్షా వాడు. చిరంజీవి లోపలికెక్కి కూర్చు న్నాడు. వీణ, కృష్ణకుమారి వెనుక కూర్చున్నారు. బందరు దూసుకుపోయే ఎక్స్‌ప్రెస్ బస్‌లకు అతి లాఘవంగా, రోడ్డు దిగకుండానే సైడిస్తూ పోనిస్తు న్నాడు రిక్షా. ఇంతలో హఠాత్తుగా ఓ కుర్రవెధవ (చిరంజీవి భాషలో స్వయంగా దేముడే ఆ వేషంలో) బస్‌ని తప్పించుకొని రిక్షాకడ్డం వచ్చేశాడు. దాంతో సడెన్ బ్రేకులు వేశేశాడు రిక్షావాడు.

ఆ కుదుపుకి కృష్ణకుమారి 'ఒహ్' అంటూ వెనక్కుపడింది చిరంజీవి వళ్లో




చిరంజీవి చటుక్కున ఆమె వీపు మీద చేతులుంచి, ఆ స్పర్శకు ఉక్కిరి బిక్కిరవుతూ ఆమెను నెమ్మదిగా లేవనెత్తాడు. రిక్షావాడికి గుండెల్లోనే ధన్యవాదా లర్పించుకున్నాడు. వాడికి కిరాయి కాకుండా మరో రెండురూపాయి లెక్కువివ్వాలని కూడా అనధికారంగా తీర్మానించుకున్నాడు అటు కృష్ణకుమారి కూడా అతని స్పర్శ తాలూకూ తీయదనం నుంచి కోలుకోలేక పోయింది. చిరంజీవి లాంటి కుర్రాడు తాకితే వళ్ళంతా అలా ఎలక్ట్రిసిటీ పుట్టుకొస్తుందన్న విషయం తన్చదివిన ఫిజిక్స్‌లో ఎక్కడా లేదు. ఆ రాత్రి యూ ఫోమ్ బెడ్ మీద నిద్రపట్టక తెల్లార్లూ అటూ ఇటూ దొర్లిందామె. మరోసారి మరోసారి అతని స్పర్శని కోరుకొంటున్న మనసు తెల్లారే సరికి పర్మనెంటుగా ఆ అనుభవాన్ని సంపాదిం చేయాలని నిర్ణయించుకొంది. పైగా వీణ చెప్పిన "మా బావ ఊరికే కలువరిస్తున్నాడే నీ పేరు" లాంటి మాటలు ఆ అభిప్రాయాన్ని బలపర్చేసినాయి.

ఆ మాట చాలు– ఏ ఆడపిల్లయినా, వయసులో ఉన్న యావరేజ్ మగాడి మీద మనసు పడ్డానికి.

అయితే వీణ సంగతేమిటి? అతను వీణ బావ: ఇద్దరికీ వరుస ఉంది.

బహుశా ఇద్దరూ పెళ్ళాడుతారేమో కూడా! మరి ఇప్పుడు ఇచ్చట తనగతేమిటి? ఇలా ఆలోచనలో సతమతమవుతూండగనే తెల్లారి పోయిందామెకి.

ఆ రాత్రంతా అలాగే నిద్రలేకుండా ఆలోచనల్లో గడిపిన మరో ప్రాణి పేరు చిరంజీవి. అతను ఒరిజినల్‌గా వీణని చేసుకోవాలను కొన్నాడు. కృష్ణకుమారిని చూసేంత వరకూ ఆ అభిప్రాయం అలానే ఉంది. కాని ఆ తరువాత అది కాస్తా బలహీనమయి పోసాగింది.

"కృష్ణకూమారి మనని షికారుకి రమ్మంది బావా!" అని వీణ చెప్పిం తరువాత వీణని పెళ్ళాడాలనే పట్టింపు తనకేమీ లేనట్లు అనిపించింది. రిక్షాలో ఆ మధుర క్షణాల తర్వాత ఆ రాత్రంతా కృష్ణకూమారిని పెళ్ళాడితే ఎలా వుండును? అన్న ఆలోచనలు వచ్చినయి. ఇంతకూ వీణకు తనమీద ఎలాంటి అభిప్రాయం ఉందో ఖచ్చితంగా తెలీట్లంలేదు. చిన్నప్పటిలాగానే ఇప్పుడూ మాట్లాడుతుంది. నవ్వుతుంది- ఎగతాళి చేసుంది. వేళా కోళాలాడుంది. అంతే! అంతేగాని ఓ వయసులోఉన్న మొగాడిదగర ఓ వయసులోఉన్న ఆడపిల్లలా ప్రవర్తించదు.

ఆ సాయంత్రం అతను ఊరెళ్ళిపోడానికని బస్ స్టాండ్‌కి బయల్దేరాడు. సరిగ్గా అంతకుముందే కృష్ణకుమారికి ఓ కుర్రాడు చీటీ అందించాడు. వీణ రాసి పంపించిందని.

"కృష్ణా! బావ మరో అరగంటలో బస్ స్టాండ్‌కి చేరుకొంటున్నాడు. వాళ్ళూరు వెళ్ళిపోతున్నాడు. నీ గురించి ప్రొద్దుట్నుంచీ ఓ వందసార్లైనా అడిగాడు. తప్పకుండా బస్‌స్టాండ్‌కి వెంటనే వచ్చేయ్. నేనూ అక్కడే వుంటాను వీణ"

చాలా స్పీడుగా డ్రస్ చేసుకొని బస్ స్టాండ్‌కి చేరుకొంది కృష్ణకుమారి అక్కడ చిరంజీవి ఒక్కడే నుంచుని కనిపించాడు సూట్‌కేస్‌తో

"హలో" అన్నాడతను వెలిగిపోతూ

"హలో...." అని చిన్నగా నవ్వి వీణకోసం చుటూ చూసిందికృష్ణకుమారి.

"వీణ రాలేదు-తీరా బయల్దేరే సమయానికి తల్నొప్పిగా ఉందని - రాలేదు."

"ఓ!...." అంది కృష్ణకుమారి సిగ్గుపడుతూ. అలా అనేందుకు సున్నాలా చుట్టిన బుల్లి మూతిని చూసి తెగ మెచ్చుటపడ్డాడు చిరంజీవి. ఆ పెదాల మీద ముద్దెట్టుకొనే అదృష్టవంతుడెవరో కదా అని హోరున అసూయపడ్డాడు.

"తనే ఎందుకాక్కూడదు?" అని ఆశపడ్డాడు.

"మీకు చాలా థేంక్సండీ! నాకు ఇక్కడ మంచి కంపెనీ ఇచ్చేరు. మీ ఋణం ఎలా తీర్చుకొంటానో ఏమో..." అన్నాడు దిగులుగా.

"నన్ను మరిచిపోకుండా ఉంటే ఋణం తీర్చుకున్నట్లే........" అంది కృష్ణకుమారి తలొంచి చేసుకొని.

ఈ లోగా జగ్గయ్యపేట బస్సొచ్చి వాళ్ళముందు ఆగింది. సూట్ కేస్‌లోపల పెట్టిమళ్ళిదిగాడు చిరంజీవి."

"నేను మిమ్మల్ని మరచి పోడమా?" అన్నాడు ఆశ్చర్యంగా.

ఆమె జవాబివ్వలేదు. ఓసారి అతని కళ్ళల్లోకి చూసి తలొం చేసుకొంది.

"సారీ : మీరు ఇక్కడికొచ్చిఇబ్బంది పడ్డారేమో...." అన్నాడు చిరంజీవి.

"అబ్బే ! అలాంటి దేమీ లేదండీ.... అంది కృష్ణకుమారి

"ఇక చాల్లే ఆపండోయ్ ! రోజుకి లక్ష తొంభై కేసులు చూస్తుంటా నిలాం టియి...అన్నట్లు హారన్ కొట్టాడు డ్రైవర్.

"మీరు కూడా నన్ను మర్చి పోకండేం ?" అన్నాడు చిరంజీవి బస్ ఎక్కుతూ.

"నేనేం మర్చిపోను – మీలాగా...." అంది కృష్ణకుమారి రోషంగా బస్ బయల్దేరింది.

వీణ బస్ స్టాండుకి రానందుకు ఇద్దరూ ఎంతోసంతోషపడ్డారు.

ఊరు చేరుకొన్నా రెండోరేజే వీణ దగ్గర్నుండి ఉత్తరం వచ్చింది.

"బావా,

ఇందాక కృష్ణకుమారి వచ్చింది. నీ గురించి అడిగింది. నీ దగ్గర్నుంచి ఉత్తరం వచ్చిందేమోనని వచ్చిందట – నువ్వు తనని మర్చిపోయావేమో అని బాధపడుతోంది. ఎప్పుడూ నీ గురించే మాటలు త్వరలో నీకు ఉత్తరం రాస్తుందట—"

ఉత్తరం చదవగానే వెంటనే మెరుపులాజవాబు రాసి పడేశాడు చిరంజీవి.

"వీణా ! కృష్ణకుమారిని మర్చిపోలేనని చెప్పు – ఆమె ఉత్తరం కోసం ఎదుర్చూస్తుంటాను...ఆమెని మరీమరీ అడిగానని చెప్పు...."

పది రోజులతరువాత వీణ దగ్గర్నుంచి మరో ఉత్తరం వచ్చింది.

"బావా! కృష్ణకుమారి నీకు ఉత్తరం వ్రాయలేకపోతోంది. సిగ్గుగా ఉందిట! అదీగాక ఈమధ్య ఆమెకు మనసేమీ బాగుండటంలేదు. వాళ్ళ వాళ్ళు ఏవో సంబంధాలు చూస్తున్నారట. హాయిగా పెళ్ళాడక దిగులెందుకే అంటే, అసల్సంగతి మొన్న చెప్పింది. తను నిన్ను ప్రేమించిందట. నువ్వు వెంటనే మామయ్యగారిని పంపి వాళ్ళ నాన్న గారితో మాట్లాడితే బాగుంటుందట. ఇంతకూ నీకు అసలు కృష్ణకుమారి నచ్చిందా ? నచ్చితే మిగతా విషయాలు పూరిచెయ్ !....వీణ."

చిరంజీవి హోరున ఆశ్చర్య పోయాడు. వీణది జాలి గుండెనీ, తమ ప్రేమ ఎడల ఏమాత్రం అసూయలేనిదనీ గ్రహించేశాడు. జవాబుగా తన తండ్రిని కృష్ణకుమారి వాళ్ళింటికి టెలిగ్రామ్ లాగా పంపించి ముహూర్తం పెట్టించేశాడు.

పెళ్ళి చాలా అర్జంటుగా జరిగి పోయింది.

ఆ రాత్రి కృష్ణకుమారిని కౌగిట్లో బంధించబోతుంటే "ఉహ : .... వద్దంటి...." అందామె సిగ్గుపడుతూ.

"అబ్బ ! ఇంత సిగ్గున్న అమ్మాయివి—షుగర్ ఫ్యాక్టరీవేపు షికార్లుకి రమ్మనీ – సంబంధాలు చూస్తున్నారు, పెద్దాళ్ళతో వెంటనే మాట్లాడమనీ – ఎలా కబుర్లు చేశావ్ ?" అన్నాడు చిరంజీవి నవ్వుతూ.

"నేనా ?" అంది కృష్ణకుమారి

ఆశ్చర్యంగా.

"లేకపోతే ఇంకెవరు ?"

"నేను షికారుకి రమ్మని కబురు చేశానా ?"

"బాపుంది ! వీణతో కబురుచెయ్యలా ఆ రోజు ?"

"ఇది మరీబా వుంది ! మీరే నా పేరు కలువరిస్తున్నారనీ – ఎలా గోలానన్ను కూడా షికారుకి వచ్చేట్లు చూడమనీ వీణతో అన్నారని వీణే చెప్పింది ... అందుకే వచ్చాను కూడా...."


"నేన్నమ్మను....పోనీ నీకు సంబంధాలు చూస్తున్నారనీ – నన్ను వెంటనే వచ్చి మీ పెద్దాళ్ళతో మాట్లాడమనీ కూడా ఉత్తరం రాయించ లేదా ?"

"ఇంకా నయం ! నాకు మావాళ్ళేమీ సంబంధాలు చూడలేదు. అసలుఅప్పుడే పెళ్లిచేయటం మావాళ్ళ క్కూడా ఇష్టం లేదు. కాని తీరా మీరు నన్ను ప్రేమించారనీ – నేకలేపోతే ఆత్మహత్య చేసుకొంటారనీ అన్నట్లు వీణ చెప్పింది, ఈలోగా మీ పెద్దాళ్ళు వచ్చి మా వాళ్ళ నడిగితే పోనీలేమ్మని నేనూ వప్పుకొన్నాను." చిరంజీవి తలరెండు చేతులోనూ పట్టుకొని అక్కడే కూర్చుండి పోయాడు.

"వీణ ఇలా మనిద్దరినీ ఎందుకు ఫూల్ చేసిందంటావ్ ?"

"ఏమో! అది మీకూ మీమరదలుకూ తెలియాలి ! అయినా ఇప్పుడా విషయాలెందుకు లెస్తూ...." అందామె అతని మీదకు వరుగుతూ.

మర్నాడు పొద్దున్నే వీణనిని లేశాడు చిరంజీవి.




"ఏమిటీ నాటకమంతా ?" అన్నాడు.

"ఏమీలేదు. లవ్ డెవలప్-అంతే! నువ్ నన్ను చేసుకోడానికి సుముఖంగా ఉన్నట్లు పసిగట్టాను– పెద్దాళ్ళు సరేసరి ఇరువెపులా అంగీకారమే ! కాని నాకు నీ మీద అటువంటి ప్రేమలేదు. చిన్నప్పటి నుంచి ఫ్రెండ్స్‌లా పెరిగాము. మనం భార్యా భర్తలు కాబోటం నాకు నచ్చలేదు. అంచేత మెల్లగా కృష్ణకుమారిని పరిచయం చేసి– కొంత ఆకర్షణ సృష్టించేశాను. నవ్వేసి అక్కడ నుంచి పరుగెత్తింది వీణ.

కృష్ణకుమారి ఓ నిమిషం తెల్లబోయి– విరగబడి నవ్వేసింది. చిరంజీవి కోపంగా ఆమె వంక చూసి– తనూ నవ్వేశాడు.

అనామిక